క్లుప్తంగా

దివ్యాంగుడికి ట్రై సైకిల్, ధ్రువపత్రం అందజేత



ధనశేఖర్‌కు వైకల్య నిర్ధారణ ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ముంతాజ్ పఠాన్

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంలో భిక్షాటన చేస్తూ జీవిస్తున్న దివ్యాంగుడు ధనశేఖర్ (35)కు ప్రభుత్వం ద్వారా ట్రైసైకిల్ అందజేసినట్లు ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ గురువారం తెలిపారు. రెండు కాళ్లను కోల్పోయి నడిచేందుకు వీల్లేని పరిస్థితుల్లో ధనశేఖర్‌కు ఇటీవల ట్రైసైకిల్ అందజేయడంతో పాటు సదరన్ స్లాట్ నమోదు చేయించి, పింఛన్ పొందేందుకు అవసరమైన వైకల్య నిర్ధారణ ధ్రువపత్రాన్ని స్వయంగా అందజేసినట్లు ఆమె చెప్పారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం శ్రమిస్తున్న సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతో సమాజంలోని విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులకు సేవ చేస్తున్నామని తెలిపారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో రాజుకు తృతీయ స్థానం



విద్యార్థి రాజును అభినందిస్తున్న టీజేపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఏఎన్‌యూ ఇటీవల నిర్వహించిన అంతర్ కళాశాలల బాడీ బిల్డింగ్ పోటీల్లో టీజేపీఎస్ కళాశాల బీఎస్సీ ద్వితీయ సంవత్సర విద్యార్థి టి. రాజు తృతీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఆటల్లో ప్రావీణ్యం సాధించాలని, తద్వారా కష్టపడే తత్వం, శ్రమించే లక్షణాలు అలవడతాయని తెలిపారు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా తట్టుకుని ముందుకు వెళ్లే నేర్పు, ఓర్పుతో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థి రాజును కళాశాల కరస్పాండెంట్ తెల్లాకుల శ్రీనివాసబాబు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి జె.వి. సుధీర్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

పాత గుంటూరు ఎస్‌హెచ్‌ఓగా సుబ్బారావు



బాధ్యతలు స్వీకరిస్తున్న సుబ్బారావు

పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్, పాత గుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ఎం.వి.సుబ్బారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2004కు బ్యాచ్‌కు చెందిన ఆయన ఎస్‌ఐగా నరసరావుపేట, రెంటచింతల, మాచర్ల పరిసర ప్రాంతాల్లో పనిచేశారు. 2011లో సీఐగా పదోన్నతి పొందిన ఆయన ఇంటిలిజెన్స్, నరసరావుపేట, గురజాల, మాచర్ల, నాయుడుపేట, వినుకొండ ప్రాంతాల్లో పని చేశారు. ఈ క్రమంలో వీఆర్‌లో ఉన్న ఆయన్ను పాత గుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా నియమితులయ్యారు.

తైక్వాండో పోటీలలో పలువురికి పతకాలు



తెనాలి అర్బన్: రెండో ఏపీ స్టేట్ లెవల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో తెనాలిలోని కేఎస్‌కే తైక్వాండో అకాడమీ క్రీడాకారులు ఏడు బంగారు, నాలుగు వెండి, అయిదు కాంస్య పతకాలు సాధించారని తెనాలి మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ తెలిపారు. ఈనెల 11,12 తేదీలలో రేపల్లెలో పోటీలు జరిగినట్లు చెప్పారు. పతకాలు సాధించిన వారిని తెనాలిలో బుధవారం అభినందించి, మెడల్స్ అందజేశారు. కౌన్సిలర్ కుర్రా సుజాత, వైఎస్సార్ సీపీ నాయకుడు కుర్రా శ్రీను, అకాడమీ నిర్వాహకులు కొక్కిలగడ్డ శ్రీనివాసరావు, ఎం.వరప్రసాద్, టి.చంటి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి: మేయర్



పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావటి మనోహర్ నాయుడు

నెహ్రూనగర్: నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో తప్పనిసరిగా నాణ్యత పాటించాలని నగర మేయర్ కావటి శివ నాగమనోహర్‌నాయుడు తెలిపారు. నగరంలోని 20వ డివిజన్‌లో బుధవారం రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 20వ డివిజన్ సంపత్‌నగర్ చివర సచివాలయం రోడ్డు, నూతనంగా వాటర్ ట్యాంక్ నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్నట్లు చెప్పారు. నగరంలోని ప్రతి వార్డుతో పాటు విలీన గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు పార్టీలకతీతంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో 20వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కంతేటి శ్యాం శేఖర్, ఖాజా మొహిద్దీన్, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

60 ఆటోల సీజ్, రూ. 33వేల జరిమానాలు



ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న సీఐ నిసార్ బాషా

పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. లైసెన్స్‌లు లేకుండా మైనర్లు ఆటోలు నడుపుతున్న నేపథ్యంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎండీ నిసార్ బాషా నేతృత్వంలో నాజ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, హిమని సెంటర్, ఆర్కేటీ, బోసు బొమ్మ సెంటర్‌తో పాటు ప్రధాన కూడళ్లలో స్పెషల్ డ్రైవ్ కొనసాగింది. లైసెన్స్‌లు లేకుండా ఆటోలు నడుపుతున్న 60 మందిని గుర్తించి వాటిని సీజ్ చేశారు. దీనితో పాటు ఆటోల్ని అద్దెకు ఇస్తున్న యజమానుల్ని కూడా పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నిసార్ బాషా స్పష్టం చేశారు. మరోమారు పునరావృతం అయితే ఆటో యజమానుల పైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోకు రూ. 550 చొప్పున రూ. 33వేలు జరిమానాలు విధించారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ డైరీ ఆవిష్కరణ



ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, సంఘం నాయకులు

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా సంఘం డైరీని కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యోగులకు హ్యాండ్ బుక్‌గా ఉపయోగపడుతుందని, వారికి అవసరమైన సమాచారాన్ని కూడా పొందుపరిచారని తెలిపారు. ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వంతో కలసి పనిచేయడంతో పాటు పూర్తి సహకారమందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు కె.వి.ఎస్. శివారెడ్డి, షేక్ కరీముల్లా షాఖాదరి, వై.నాగేశ్వరరావు, ఎల్.పద్మావతి, కె.సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

యూత్ గేమ్స్‌కు ఏసీ కళాశాల విద్యార్థి ఎంపిక



నిత్య సంతోష్‌ను అభినందిస్తున్న మోజేస్, ప్రీతమ్ ప్రకాష్

గుంటూరు ఎడ్యుకేషన్: మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈనెల 30 నుంచి జరగనున్న జాతీయ స్థాయి ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఏసీ కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.మోజెస్ తెలిపారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన విద్యార్థి అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఏ ప్రథమ సంవత్సర విద్యార్థి జి. నిత్య సంతోష్ గత నెల 30 నుంచి ఈనెల 2వ తేదీ వరకు కేరళలోని తిరువనంతపురంలో జరిగిన జాతీయ స్థాయి జూనియర్ జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని కాంస్య పతకం పొందినట్లు తెలిపారు. దీంతో పాటు ఈనెల 8,9,10వ తేదీల్లో వైజాగ్‌లో జరిగిన స్టాక్ జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని ఐదు విభాగాల్లో బంగారు పతకాలు సాధించాడని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రీతమ్ ప్రకాష్ పాల్గొన్నారు.

తిరుగు ప్రయాణాలతో ఆర్టీసీ బస్టాండ్ రద్దీ

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సుల ఏర్పాటు



గుంటూరు బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

పాత గుంటూరు: సంక్రాంతి పండుగకు జిల్లాలోని సొంతూళ్లకు వచ్చినవారు అనంతరం తిరుగు ప్రయాణమవుతున్నారు. విద్యార్థులకు బుధవారంతో సెలవులు ముగియడంతో స్వస్థలాల నుంచి హాస్టల్, పాఠశాలలకు వెళ్లేందుకు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో జిల్లాలోని మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోలతో పాటు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ముఖ్యంగా దూరప్రాంత ఆర్టీసీ సర్వీసుల్లో రద్దీ ఎక్కువగా కన్పించింది. ఈ రెండు రోజుల పాటు మరింత రద్దీ పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దానికనుగుణంగా లోకల్ సర్వీసుల్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. షెడ్యూల్ సర్వీసులతో పాటు బుధవారం, గురువారాల్లో గుంటూరు బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు ఆరు, తెనాలి నుంచి ఒకటి, మంగళగిరి నుంచి ఒకటి, పొన్నూరు నుంచి ఒకటి చొప్పున ప్రత్యేక బస్సుల్ని ఏర్పాటు చేశారు. బెంగుళూరుకు తొమ్మిది, చెన్నైకు ఐదు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

22న 'సూర్యచంద్రులు' సంగీత విభావరి



బ్రోచర్ ఆవిష్కరించిన సాయి లక్కరాజు

తెనాలి: స్వర్గీయ ఎన్టీఆర్, ఏఎన్నార్‌ల వర్ధంతి పురస్కరించుకుని పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో 'సూర్యచంద్రులు' పేరుతో ఈనెల 22న సంగీత విభావరిని నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు చెప్పారు. సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సంబంధిత బ్రోచర్‌ను ఆహ్వానించారు. ఆరోజు సాయంత్రం 5.30 గంటలకు తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో సంగీత విభావరి ఉంటుందన్నారు. సినీవినీలాకాశంలో సూర్యచంద్రుల వంటి వారు ఎన్టీఆర్, ఏఎన్నార్ అనే భావనతో నిర్వహించే కార్యక్రమంలో ప్రముఖ గాయనీగాయకులు వారి పాటలతో అలరిస్తారని చెప్పారు. సంగీత ప్రియులు జయప్రదం చేయాలని కోరారు.

గుంటూరులో సినీ హీరో కిరణ్ సందడి



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్

పాత గుంటూరు: ఎస్ఆర్ కల్యాణ మండపం చిత్రహీరో అబ్బవరం కిరణ్ బుధవారం గుంటూరులో సందడి చేశారు. ఆయన నటించిన 'వినరో భాగ్యము విష్ణు కథ' ప్రమోషన్‌లో భాగంగా కొత్తపేటలోని భాస్కర్ డీలక్స్ థియేటర్‌కు వచ్చారు. ప్రేక్షకుల మధ్యకు వెళ్లి తన సినిమాలోని డైలాగ్‌లతో ఉత్సాహపరిచారు. అనంతరం విలేకరులతో కిరణ్ మాట్లాడారు. 'వినరో భాగ్యము విష్ణు కథ' సినిమా శివరాత్రికి విడుదలవుతుందని చెప్పారు. ప్రేక్షకులు కుటుంబ సమేతంగా చూసి చిత్రాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బెదిరించి సెల్‌ఫోన్ లాక్కెళ్లిన ఇద్దరి అరెస్టు

పట్నంబజార్: వ్యక్తిని కత్తితో బెదిరించి సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం, కొత్తపల్లి గ్రామానికిచెందిన ఆదిబోయిన గురవయ్య పలు పనుల నిమిత్తం ఈనెల 17వ తేదీ రాత్రి గుంటూరు బస్టాండ్ వద్దకు వచ్చాడు. ఆటోనగర్ వెళుతున్న క్రమంలో ఇద్దరు యువకులు కత్తితో బెదిరించి అతనిపై దాడిచేసి సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు జాకీర్ హుస్సేన్‌నగర్‌కు చెందిన గోవాడ మహేష్, బుచ్చయ్యతోటకు చెందిన షేక్ సోహెల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, నేరాన్ని ఒప్పుకున్నారు. ఈమేరకు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

20 నుంచి శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి 22 వరకు సంగీత జగద్గురు శ్రీ త్యాగరాజు బ్రహ్మ 176వ ఆరాధనోత్సవాల్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.వై. శేషురాణి బుధవారం ప్రకటనలో తెలిపారు. 20, 21వ తేదీల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్థానిక కళాకారుల లఘు కచేరీలు, సాయంత్రం ప్రధాన శాస్త్రీయ సంగీత కచేరీలు మూడు రోజుల పాటు జరుగుతాయని పేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని ఆమె కోరారు.

జూదరుల అరెస్ట్

గుంటూరు రూరల్: రాత్రి సమయంలో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు నల్లపాడు పోలీసులు బుధవారం దాడిచేసి జూదరులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం వెంగళాయపాలెంలో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ.5వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించినట్లు సీఐ వెల్లడించారు.

ప్రజలతో మర్యాదగా వ్యవహరించండి

తెనాలి అర్బన్: సచివాలయాలకు వచ్చిన ప్రజలతో మర్యాదగా వ్యవహరించడంతో పాటు స్నేహపూర్వకంగా నడుచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఆదేశించారు. పట్టణంలోని 41,42 సచివాలయాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన లబ్ధిదారుల లిస్టలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని సూచించారు. అధికారులు అడిగిన ప్రతి సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందజేయాలని చెప్పారు.

దాడిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వ్యక్తిపై పలువురు దాడి చేసి గాయపరిచిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బ్రాడీపేటకు చెందిన షేక్ అర్షద్ హుస్సేన్ తోపుడు బండిపై వ్యాపారం చేస్తుంటాడు. బుధవారం బాష అనుచరులతో వచ్చి డబ్బులు డిమాండ్ చేశాడు. హుస్సేన్ ఇచ్చేందుకు నిరాకరించాడు. దీంతో బాషాతో పాటు అతని అనుచరులు దాడి చేశారు. రాడ్డుతో తలపై కొట్టడంతో హుస్సేన్ తీవ్ర గాయమైంది. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

యువతి అదృశ్యంపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌వీఎన్ కాలనీకి చెందిన కిలారు సాయిశ్రీ ఈనెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లారినెట్ విద్వాంసుడు లక్ష్మీనారాయణకు సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం ఉమ్మడి కుటుంబం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం సింహం నవ్వింది చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ క్లారినెట్ విద్వాంసుడు సుజ్జన లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొరపాటి లక్ష్మి, కొర్రపాటి శ్రీనివాస్, మానుకొండ మహేష్, మానుకొండ తులసీ చిరంజీవి, కార్తికేయ చౌదరి, పెమ్మ సాని పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

దుకాణ సముదాయాలకు శంకుస్థాపన

ఎమ్మెల్యే ముస్తఫా



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: నగరంలోని బ్రహ్మానందరెడ్డి స్టేడియం వెలుపల వ్యాపార దుకాణాల సముదాయానికి తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్‌ముస్తఫా బుధవారం శంకుస్థాపన చేశారు. 16 దుకాణాల్ని రూ. 68లక్షలతో నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో బీఆర్ స్టేడియం అధికారులు మహేష్, వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు షేక్ మీరావలి, షేక్ మెహమూద్, యిర్రి ధనలక్ష్మి, ఖాజామొహిద్దీన్‌చిష్టి, వైఎస్సార్ సీపీ నేతలు యిర్రి సాయి, రాచమంటి భాస్కర్, పున్నారావు, టోపీ బాబు, నిర్మల, అవినాష్, పాపారావు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా షరీఫ్



షరీఫ్‌ను గజమాలతో సన్మానిస్తున్న ఏపీ ఎన్జీవో నేతలు

గుంటూరు మెడికల్: ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ షేక్ షరీఫ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం అసోసియేషన్ ఎన్నికల్ని విజయవాడలోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో షరీఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికవ్వడంతో గుంటూరు ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాస్, జిల్లా సెక్రటరీ సతీష్‌కుమార్, నగర అధ్యక్షుడు ఎస్.పి.ఎస్.సూరి, నగర సెక్రటరీ చింతల కల్యాణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ కూరాకుల శ్రీనివాస్, నర్సుల సంఘం నాయకురాలు వెల్లంపల్లి పద్మజ, ఆర్డీ కార్యాలయం సూపరింటెండెంట్ గోపవరపు స్టాన్లి రాజ్‌కుమార్, సుధీర్, సీనియర్ అసిస్టెంట్లు బూసి అనిల్‌కుమార్, పట్టపు పాల్, తదితరులు అభినందనలు తెలిపి గజమాలతో సన్మానించారు. షరీఫ్ గతంలో గుంటూరు జిల్లా కార్యదర్శిగా, మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్ర కార్యవర్గంలో తనకు పనిచేసే అవకాశం కల్పించిన రాష్ట్ర నాయకులు బండి శ్రీనివాసరావు, కె.వి.శివారెడ్డికి, జిల్లా నేతలకు షరీఫ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కానిస్టేబుల్ నమూనా పరీక్షకు స్పందన



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఏసీ కళాశాలలో కానిస్టేబుల్ పోస్టుల నమూనా పరీక్ష నిర్వహించారు. ప్రశ్నపత్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కొమ్మలపాటి మోజెస్ ఆవిష్కరించారు. పరీక్షా విధానంపై అవగాహన కలిగించే ఉద్దేశంతో నమూనా పరీక్ష నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. నమూనా పరీక్ష రాసిన అభ్యర్థులు ఈనెల 22న ప్రభుత్వం నిర్వహించనున్న ప్రిలిమినరీ పరీక్షలో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ నమూనా పరీక్ష రాయడం ద్వారా అభ్యర్థులు ఏఏ అంశాల్లో వెనుకబడి ఉన్నామనే విషయాలను తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. పరీక్షకు పెద్దసంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యారని, భవిష్యత్తులో గ్రూప్–2, డీఎస్సీ నమూనా పరీక్షలను సైతం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు రూపస్, సుధీర్, విద్యార్థి నాయకులు పి.భార్గవ, ఎమ్.కిరణ్‌కబీర్, అఖిల్, సుప్రజ, ఉదయ్, రినేష్ పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలి

ఏడీఏ తిరుమలాదేవి

మంచాల (చేబ్రోలు): రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని పొన్నూరు ఏడీఏ సీహెచ్.తిరుమలాదేవి చెప్పారు. చేబ్రోలు మండలం మంచాలలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎఫ్ఎస్ఎం ద్వారా జిల్లాలో మంచాల గ్రామాన్ని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. చిరుధాన్యాల పంటల సాగు ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలను చేపట్టామని, జొన్నలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం ప్రారంభించామని వివరించారు. అనంతరం స్థానిక ఆర్బీకేలో రైతులతో జరిగిన సమావేశంలో ఏడీఏ తిరుమలాదేవి మాట్లాడుతూ పొలంబడి ద్వారా మంచాల గ్రామంలోని క్లస్టర్‌లో 250 ఎకరాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఏవో బి. శ్రీనివాస నాయక్, వీఏఏ కె.రమ్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.

మహిళల వెయిట్‌లిఫ్టింగ్‌లో విజేతలు



విజేతలైన లిఫ్టర్లతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇటీవల నిర్వహించిన అంతర కళాశాలల మహిళల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ విద్యార్థి ముక్కడాల అనూష 65 కిలోల విభాగంలో తలపడి కాంస్య పతకం సాధించింది. ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పీజీ క్యాంపస్‌లో పీజీ చేస్తూ, ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో శిక్షణ పొందుతున్న తోట లావణ్య (55 కిలోలు), ముక్కామల సంయుక్త (87 కిలోలు) తమతమ కేటగిరీ పోటీల్లో బంగారు పతకాలను సాధించారు. ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీవరకు కేరళలోని కాలికట్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరగనున్న మహిళల వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తోట లావణ్య, ముక్కామల సంయుక్త ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహిస్తారని కాలేజీ వ్యాయామ అధ్యాపకుడు నల్లక శేషగిరిరావు తెలిపారు. క్రీడాకారిణులను ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అభినందించారు.

యాజమాన్య పద్ధతులతో మంచి దిగుబడులు



మిర్చి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న హార్టీకల్చర్ డెప్యూటీ డైరెక్టర్ సుజాత

గుంటూరు రూరల్: సరైన సమయంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని హార్టీకల్చర్ డెప్యూటీ డైరెక్టర్ ఎన్. సుజాత తెలిపారు. బుధవారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో మిర్చి తదితర మెట్ట పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. రసాయన పురుగు మందుల్ని అతిగా వినియోగించవద్దని హితవు పలికారు. తెగుళ్ళు, పురుగుల నివారణ చర్యల గురించి వివరించారు. మిర్చి పంటలో నల్లతామర, పత్తి పంటలో గులాబీ రంగు పురుగు వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందని వెల్లడించారు. పంటలను కాపాడుకునే విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి శిరీష, వీఏఏ ఆనందబాబు, ఉపసర్పంచ్ వంగా నవీన్‌రెడ్డి, రైతులు నామా శ్రీనివాసరావు పాల్గొన్నారు.